తెలుగు దినపత్రిక
# డైలీ రిపోర్ట్
DAILY REPORT




సంపుటి: 1 సంచిక: 60 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: తెలంగాణ బుధవారం 2-10-2024 వెల: 5/రూ -

## గురుద్వారా, దర్గా, గుడి.. రోడ్లపై ఏది ఉన్నా..

# తొలగించాల్సిందే!

- ప్రజాప్రయోజనం, భద్రతే ముఖ్యం
- ఆక్రమణల తొలగింపునకు మతాలతో సంబంధం లేదు
- దేశమంతటా వర్తించేలా మార్గదర్శకాలు జారీ చేస్తాం
- 'బుల్డోజర్ కూల్చివేతల'పై విచారణలో సుప్రీంకోర్టు
- తీర్పు రిజర్వు.. అప్పటి వరకు కూల్చొద్దని ఆదేశం



న్యూఢిల్లీ, రహదారులు, జలాశయాలు, రైల్వే ట్రాక్‌లను ఆక్రమించి నిర్మించిన ఏ మతానికి సంబంధించిన కట్టడాలనైనా తొలగించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రజాప్రయోజనం, వారు సురక్షితంగా ఉండడమే అత్యంత ప్రధాన అంశమని తేల్చి చెప్పింది. రోడ్డు మధ్యలో గురుద్వారా లేదా దర్గా లేదా గుడి.. ఏది నిర్మించినా ఉపేక్షించరాదని.. అవి ప్రజలకు ప్రతిబంధకంగా మారరాదని పేర్కొంది. మతంతో నిమిత్తం లేకుండా దురాక్రమణలను తొలగించే చర్యలు ప్రజలందరికీ వర్తింపజేయాలంది. అక్రమ నిర్మాణాల కూల్చివేతకు సంబంధించి దేశమంతటా వర్తించేలా మార్గదర్శకాలు జారీ చేస్తామని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. నేరగాళ్ల ఇళ్లపై బుల్డోజర్ చర్యలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం విచారణ

మిగతా 2లో

# సామాన్యులకు నష్టం కలిగించను

- హైడ్రాతో ప్రభుత్వానికి మంచి పేరు వచ్చింది
- సహించలేకే విపక్షాల దుష్ప్రచారం
- నిర్వాసితులకు వసతి ఏర్పాట్లు చేశాం
- హైకోర్టు అడిగిన వివరాలు ఇవ్వడానికి సిద్ధం
- హైదరాబాద్ భవిష్యత్తు కోసమే ఈ చర్యలు
- కూల్చివేతలపై ఖర్గేకు రేవంత్‌రెడ్డి వివరణ
- హర్యానా ప్రచారం తర్వాతేరాహుల్‌తో భేటీ



న్యూఢిల్లీ, హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ఆదేశాలు, విపక్షాల ఎదురుదాడి నేపథ్యంలో సోమవారం రాత్రి ఢిల్లీకి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం అధిష్ఠానం ముఖ్యులతో భేటీ అయ్యారు. మొదట కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో, అనంతరం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో చివరకు వారిద్దరి సలహా మేరకు రాజ్యసభ ఎంపీ, ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీలతో కీలక మంతనాలు

- మిగతా 2వ పేజీలో

# 68.72% పోలింగ్

- జమ్మూ కశ్మీర్‌లో ముగిసిన ఓటింగ్
- మూడో దశలో రికార్డు స్థాయిలో పోలింగ్
- మూడు దశల్లో కలిపి మొత్తం 64.45%
- తొలిసారిగా ఓటువేసిన శరణార్థులు, వాల్మీకులు, గూరా?లు
- జమ్మూ కశ్మీర్ మూడో దశలో 68.72% పోలింగ్

2లో



## సూపర్ 6 అమలు చేస్తాం

- ప్రతి హామీ నెరవేర్చి తీరుతాం: బాబు
- ఇప్పటికే మెగా డీఎస్సీ వేశాం
- డిసెంబరులో పరీక్షలు.. వెంటనే భర్తీ
- పింఛను రూ.4 వేలకు పెంచాం
- దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు
- 175 అన్నక్యాంటీన్లు పెట్టాం

# చీపుర్లు, రోకళ్లతో సిద్ధంగా ఉండండి



- చాకలి ఐలమ్మ, రాణిరుద్రమ మీకు స్ఫూర్తి
- మనకేంది అనుకుంటే.. మొదటికే మోసం
- మూసీ సుందరీకరణపై మేమూ దృష్టి పెట్టాం
- పేదలకు ఇబ్బంది అని కేసీఆర్ వద్దన్నారు
- హైకోర్టు మందలించినా సిగ్గు, లజ్జ లేదు
- ' బాధితులకు బీఆర్ఎస్ భరోసా'లో కేటీఆం

హైదరాబాద్ : "పక్క వాళ్ల ఇళ్లు కూలగొడుతున్నరు మనకేంది.. వాళ్లతో పంచాయతీ ఉందని మీరు అనుకోవద్దు. ఇయ్యాల వాళ్ల వంతు.. రేపు అదే బుల్డోజర్ మీ వద్దకు వస్తుంది. నలుగురు బ్రోకర్ గాళ్లను పంపి మిమ్మల్ని ఇచ్చగొట్టే ప్రయత్నం చేస్తరు. మన ప్రాంతానికి బుల్డోజర్లు వస్తున్నయంటే అందరూ ఒక్కటి కావాలి. యంత్రాలు, అధికారులను అడుగు పెట్టనీయొద్దు. మన ఇళ్ల మీదకు వస్తున్నారంటే..

- మిగతా 2వ పేజీలో

## కాలి నడకన కొండకు పవన్

- మోకాళ్ల పర్వతం వరకు వడివడిగా
- అక్కడి నుంచి పవన్‌లో అలసట
- వాహనంలో వెళ్లేందుకు ఏర్పాట్లు
- అయినా, మధ్య మధ్య విశ్రాంతితో
- నడుస్తూనే తిరుమలకు జనసేనాని
- నేడు ప్రాయశ్చిత్త దీక్ష విరమణ

2లో

# ధనిక, పేద తేడా లేకుండా హెల్త్‌ప్రొఫైల్!

- ప్రతి కుటుంబానికి డిజిటల్ హెల్త్ కార్డులు
- ఆర్డీవో స్థాయిలో పైలట్ ప్రాజెక్టు పర్యవేక్షణ
- రేపు ప్రారంభించనున్న సీఎం
- దసరా లోపు లబ్ధిదారులకు

డబుల్ బెడ్‌రూం ఇళ్లు: పొంగులేటి



# సూపర్ 6 అమలు చేస్తాం

కర్నూలు, అక్టోబరు 1 'జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. పాలనంతా గాడి తప్పింది. ఖజానాలో చిల్లిగవ్వ లేదు. రూ.10 లక్షల కోట్లు అప్పులు చేస్తే.. వడ్డీనే రూ.లక్ష కోట్లు అవుతోంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తంచేశారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఇటుక ఇటుక పేర్చి రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తున్నానని చెప్పారు. రాష్ట్రానికి పూర్వ వైభవం తెచ్చేంత వరకు ఓ సైనికుడిలా పని చేస్తానని స్పష్టం చేశారు. మంగళవారం కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పుచ్చకాయలమడలో ఆయన ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను సొమ్ము స్వయంగా అందజేశారు. కుటుంబ సభ్యులతో మమేకమై వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కష్టసుఖాల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామంలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 'ప్రజావేదిక పేదల సేవలో' సభలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు జీతం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉండేదని, టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామన్నారు. పేదల జీవితాల్లో వెలుగు చూడాలన్నదే తన సంకల్పమని చెప్పారు. 'పెంచిన పెన్షన్‌ను ఏప్రిల్ నుంచే ఇస్తానని ఎన్నికల్లో చెప్పినట్లు ఒకేసారి రూ.7 వేలు పంపిణీ చేశాను. మన ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే రూ.12,500 కోట్లు పంపిణీ చేశాం. ఏడాదికి రూ.35 వేల కోట్లు ఖర్చువుతుంది. ఈ పథకాన్ని శాశ్వతంగా కొనసాగిస్తాం..' అని తెలిపారు. ఇంకా ఏమన్నారంటే..

**అనుసంధానంతో కరువు, వలసలు ఉండవ్..**

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో మిగులు జలాలు రాయలసీమ ప్రాంతానికి వాడుకునే అవకాశం ఉంటుంది. గోదావరి, పెన్నా అనుసంధానం చేస్తే సీమ సస్యశ్యామలమై కరువు, వలసలు ఉండవు. అందుకే పోలవరాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాం. ఈ ప్రాజెక్టును పూర్తి చేసి తద్వారా మిగులు జలాలను రాయలసీమకు మళ్లించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసి తీరుతాం. హైదరాబాద్ తరహాలో అమరావతి నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. 2019లో టీడీపీని గెలిపించి ఉంటే.. ఇప్పటికే పోలవరం, అమరావతి పూర్తయ్యేవి. ఆ ఎన్నికల్లో ఓటర్లు తప్పు చేసి జగన్‌ను గెలిపిస్తే.. రాష్ట్రాన్ని ధ్వంసం చేయడమే కాదు.. ఖజానాలో చిల్లిగవ్వ లేకుండా మొత్తం దోచుకెళ్లాడు. అందుకే ఆయన్ను ఎస్కోబార్ అన్నాను. మొన్నటి ఎన్నికల్లో నేను, పవన్ కల్యాణ్, బీజేపీ కలిసి పోటీ చేస్తే అపూర్వమైన విజయాన్ని అందించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలి. పరిశ్రమలు రావాలి. జగన్ ఈ రెండింటినీ నిర్వీర్యం చేశారు. ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదు. పరిశ్రమలు పెట్టాలనుకున్నవారు భయంతో పారిపోయారు. మళ్లీ మనం అధికారంలోకి వచ్చాక ఈ రెండు రంగాలపై దృష్టి పెట్టాం. సాంకేతికతను సద్వినియోగం చేసుకుని ఇంట్లో ఉంటూ పని చేసుకునేలా వర్క్ ఫ్రమ్ హోం విధానాన్ని అభివృద్ధి చేస్తాం.

ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తాం. కూటమి అధికారం చేపట్టగానే 16,300 ఉద్యోగాలతో మెగా డీఎస్సీ ఇచ్చాం. డిసెంబరులో పరీక్షలు పూర్తి చేసి ఉద్యోగాలు ఇస్తాం. పింఛన్లు రూ.4 వేలకు పెంచాం. దీపావళి నుంచి ఏటా ఇంటికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తాం. అన్న క్యాంటీన్లు 175 పెట్టాం. సూపర్ సిక్స్ హామీలు ఒక్కొక్కటిగా అమలు చేసి పేదలను లక్షాధికారులను చేయాలనే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. డిసెంబరులో స్కిల్ సెన్సస్ పూర్తి చేస్తాం. గత ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తెచ్చి రైతుల భూములతో ఆడుకుంటే మన ప్రభుత్వం రాగానే ఆ యాక్టును రద్దు చేశాం. రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తాం. నాణ్యమైన మద్యం క్వార్టర్ సీసా రూ.99కే అందజేస్తాం. అదే క్రమంలో మద్యం అలవాటు మార్చేసేందుకు రూ.100 కోట్లతో ఓ పథకాన్ని తీసుకొస్తున్నాం. ప్రతి ఇంటికీ 200 యూనిట్లకు సూర్యఘర్ పథకం కింద సోలార్ పవర్ ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తాం. వరద బాధితులకు ప్రజలు అండగా నిలిచారు. ప్రభుత్వం రూ.650 కోట్లు ఖర్చు చేస్తే ప్రజలే రూ.436 కోట్లు అందించి ఆదుకున్నారు.

# చీపుర్లు, రోకళ్లతో సిద్ధంగా ఉండండి

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కో మహిళ చీపుర్లు, రోకళ్లు చేతబట్టాలి. చాకలి ఐలమ్మ, రాణిరుద్రమల్లా పోరాడాలి" అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్ అంబర్‌పేట నియోజకవర్గంలోని గోల్నాక తులసిరాంనగర్(లంక)లో జరిగిన 'మూసీ బాధితులకు బీఆర్ఎస్ భరోసా' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానికులతో మాట్లాడి వారి బాధలు తెలుసున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వం పేదలకు బతుకమ్మ, దసరా పండుగ సంతోషం లేకుండా చేస్తోందని మండిపడ్డారు. పేదల ఇళ్లు కూలగొట్టి రూ.1.50 లక్షల కోట్లతో మాల్, హోటల్ కడతామంటున్నారని, దీంతో ఎవరికి లాభమనిని ప్రశ్నించారు. ఇళ్లలో ఎవరూ లేని సమయంలో వస్తారని, అందరూ వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసుకొని.. ఒక్క మెసేజ్‌తో అప్రమత్తంగా ఉండాలని స్థానికులకు సూచించారు. మూసీ సుందరీకరణ చేయాలని తమ ప్రభుత్వ హయాంలోనూ భావించామని, 28 వేల పేదల ఇళ్లు తొలగించాల్సి వస్తుందంటే.. కేసీఆర్ సూచనతో ప్రాజెక్టును పక్కన పెట్టామని కేటీఆర్ తెలిపారు. రేవంత్‌రెడ్డి మాత్రం రూ.1.50 లక్షల కోట్లతో పేదలను ఆగం చేసే ప్రాజెక్టు చేపడుతున్నారని ఆరోపించారు. తాము రూ.16 వేల కోట్లతో ప్రతిపాదించిన ప్రాజెక్టు పది రెట్లు ఎలా పెరిగిందని ప్రశ్నించారు. మార్క్ చేసిన ఇళ్లపై ఆర్‌బీ ఎక్స్ అని రాస్తున్నారు.. వాటిని చెరిపేసి కేసీఆర్ అని రాయండి.. ఎవడు వచ్చి టచ్ చేస్తడో చూస్తామన్నారు. నిన్ననే హైకోర్టు ప్రభుత్వాన్ని, హైడ్రాను మందలించింది అయినా రేవంత్‌కు సిగ్గు, లజ్జా లేకుండా మలక్‌పేట నియోజకవర్గంలో కూల్చివేతలు ప్రారంభించారని విమర్శించారు. మీకు కష్టం వస్తే ఎమ్మెల్యే



వచ్చాడు.. మీ ఓట్లతో గెలిచిన ఎంపీ ఎక్కడ అని సికింద్రాబాద్ ఎంపీ కిషన్‌రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ ప్రశ్నించారు. పేదలను ఆగం చేసేందుకు రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి ఒక్కటయ్యారని, అందుకే ఇక్కడి ఎంపీ మాట్లాడడం లేదన్నారు.

**ఫిరాయింపులపై రెండు మాటలా?**

'పార్టీ ఫిరాయింపులపై హిమాచల్‌లో నీతులు చెబుతారు. తెలంగాణలో గోతులు తవ్వుతారు? యూపీలో బుల్డోజర్‌రాజ్ తప్పంటారు. హైదరరాబాద్‌లో మీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే ఒప్పంటారు..! ఇదేం నీతిమాలిన.. అవకాశవాద రాజకీయం రాహుల్ గాంధీజీ' అంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. మరోవైపు.. కేటీఆర్ వాహనంపై కాంగ్రెస్ వర్గం దాడి చేయడం సరికాదని మాజీ మంత్రులు, హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీశ్ రెడ్డి తదితరులు ఖండించారు.

# ధనిక, పేద తేడా లేకుండా హెల్త్‌ప్రొఫైల్!

(మొదటి పేజీ తరువాయి)



హైదరాబాద్, రాష్ట్రంలో పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి కుటుంబానికి హెల్త్ ప్రొఫైల్ రూపొందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ప్రొఫైల్ రూపొందించి, విశిష్ట సంఖ్య (యూనిక్ నంబర్)తో స్మార్ట్ కార్డు ఇవ్వడమే ఫ్యామిలీ కార్డు ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సామాన్య ప్రజలకు సాధ్యమైనంత మేలు చేయాలన్న సంకల్పంతోనే ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డును తీసుకొస్తోందని వెల్లడించారు. అత్యంత ప్రాధాన్యం ఉన్న ఈ కార్డుల జారీలో పొరపాట్లకు తావులేకుండా, కుటుంబ సభ్యుల వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయం నుంచి మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి సంబంధించి 119 నియోజకవర్గాల్లోని 238 ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్నామని వివరించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని ఎంచుకోవాలని సూచించారు. 3 నుంచి 7వ తేదీ వరకు ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి వివరాలను సేకరించాలన్నారు. ఈ మొత్తం ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి నియోజకవర్గానికి ఆర్డీవో స్థాయి, జోనల్ కమిషనర్ స్థాయి వారిని ప్రత్యేక అధికారులుగా నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 3నపైలట్ ప్రాజెక్టును సీఎం ప్రారంభిస్తారన్నారు. దాని ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడతామని చెప్పారు.నాలుగేళ్ల నుంచి లక్షలాది మంది ఎల్ఆర్ఎస్ కోసం ఎదురు చూస్తున్నారని, ఏ మాత్రం ఆలస్యం చేయకుండా యుద్ధప్రాతిపదికన దరఖాస్తులను పరిష్కరించాలని మంత్రి పొంగులేటి కలెక్టర్లను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదన్నారు.

# తొలగించాల్సిందే!

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టింది. భారత్ సెక్యులర్ దేశమని, ఆక్రమణల తొలగింపు, బుల్డోజర్‌తో చర్యలు మతాలతో సంబంధం లేకుండా అందరికీ ఒక్కటేనని ధర్మాసనం పేర్కొంది. ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు హాజరయ్యారు. వాదనల సందర్భంగా 'ఏదైనా క్రిమినల్ కేసులో నిందితుడిగా ఉండడమే బుల్డోజర్ చర్యలకు ఆధారమా?' అని ధర్మాసనం మెహతాను ప్రశ్నించింది. స్పందించిన మెహతా.. "కచ్చితంగా కాదు. అత్యాచారం, ఉగ్రవాదం వంటి ఘోరమైన నేరాల్లో నిందితులైనా సంబంధం లేదు. ఒక్కరోజు ముందు నోటీసు ఇంటి గోడపై అంటించినా పరిగణనలోకి తీసుకోం. ఆక్రమణలు గతంలోనే జరిగి ఉంటేనే చర్యలు తీసుకొంటాం" అని బదులిచ్చారు. ఒకే మతం వారిని లక్ష్యంగా పెట్టుకున్నామన్న ఆరోపణలతో కోర్టు ఆదేశాలు జారీ చేస్తున్నట్లుగా ఉందని తాను ఆందోళన చెందుతున్నట్లు తుషార్ మెహతా పేర్కొన్నారు. స్పందించిన ధర్మాసనం.. "మనది సెక్యులర్ దేశం. మేం జారీ చేసిన మార్గదర్శకాలు అందరికీ వర్తిస్తాయి. జాతి, మతంతో సంబంధం లేదు. ఆక్రమణల విషయానికి వస్తే మేం ఇప్పటికే స్పష్టంగా చెప్పాం. గురుద్వారా లేదా దర్గా లేదా గుడి ఏదైనా, ఏ మతపరమైన ప్రార్థనా మందిరమైనా రోడ్లు, ఫుట్‌పాత్‌లు, జలాశయాలు, రైల్వే ట్రాక్‌లు, ప్రభుత్వ భూములు, అటవీ భూములు వంటి వాటిలో ఉంటే కచ్చితంగా తొలగించాల్సిందే. అవన్నీ ప్రజలకు అడ్డంకి కాదా? అక్రమ నిర్మాణాల విషయంలో అందరికీ ఒకే చట్టం వర్తిస్తుంది. వాటిని ఎప్పుడూ సమర్థించం" అని వ్యాఖ్యానించింది. "అక్రమ నిర్మాణాల విషయంలో ఎవరికైనా ఒకే చట్టం. మతం లేదా ప్రజల విశ్వాసాలతో సంబంధం లేదు" అని జస్టిస్ గవాయ్ స్పష్టం చేశారు. మునిసిపల్ కార్పొరేషన్లు, పంచాయతీలకు వేర్వేరు చట్టాలు ఉన్నాయని తెలిపింది. ఆన్‌లైన్ పోర్టల్‌లో అన్ని వివరాలు ఉండాలని, దానివల్ల ప్రజలకు సమాచారం లభిస్తుందని ధర్మాసనం పేర్కొంది. ఇదేసమయంలో ఐరాస ప్రతినిధి తరపున దేశంలో ఇళ్ల లభ్యతపై సీనియర్ న్యాయవాది బృందా గ్రోవర్ వాదనలు వినిపించబోగా.. తుషార్ మెహతా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం లేదని, దేశ న్యాయస్థానాలకు తగిన సామర్థ్యం ఉందని చెప్పారు. ఈ అంశంలో అంతర్జాతీయ జోక్యం అవసరం లేదని స్పష్టం చేశారు. పిటిషనర్ల తరపున న్యాయవాది సీయూ సింగ్ వాదిస్తూ.. నేరాలపై పోరాటానికి బుల్డోజర్ చర్యలను ఆయుధాలుగా వాడుకోరాదన్నారు. మైనారిటీలపై తీసుకున్న చర్యలు తక్కువేనని మెహతా పేర్కొనడాన్ని తప్పుపట్టిన ధర్మాసనం.. 4.45 లక్షల ఇళ్లను కూలగొట్టారని తెలిపింది.

# సామాన్యులకు నష్టం కలిగించను

(మొదటిపేజీ తరువాయి)

జరిపారు. అక్రమ నిర్మాణాలను కూల్చే విషయంలో హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో వారితో ఆయన చర్చలు సాగినట్లు తెలిసింది. ఇప్పటివరకు హైడ్రా అధ్వర్యంలో జరిగిన కూల్చివేతలు, వాటిపై వచ్చిన ప్రతిస్పందనల గురించి ముఖ్యమంత్రి వివరించారు. ఈ చర్యలతో ప్రభుత్వానికి ప్రజలలో చాలా మంచి పేరు వచ్చిందన్నారు. దానిని సహించలేక ప్రతిపక్షం ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలుచేసే ప్రచారాన్ని ఉధృతంగా చేస్తోందని ఆయన వివరించారు. హైదరాబాద్‌లో వర్షాలు, వరదల మూలంగా ఏర్పడుతున్న కల్లోల పరిస్థితులను అరికట్టాలంటే ఇలాంటి చర్యలు తప్పవని ఆయన చెప్పారు. న్యాయస్థానానికి తగిన వివరణలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, సామాన్య ప్రజలకు, బడుగు, బలహీన వర్గాలకు నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలన్నదే తన ఉద్దేశమని ఆయన వివరించినట్లు తెలిసింది. నిర్వాసితులకు న్యాయం చేసేందుకు, ప్రత్యామ్నాయ నివాస ఏర్పాట్లు కల్పించేందుకు తగిన ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. హైకోర్టు చేసిన వ్యాఖ్యలు గురించి ఆయన అభిషేక్ సింఘ్వీ సలహాలను కోరినట్లు సమాచారం. ఇటీవల జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అస్వస్థతకు గురైన ఖర్గేను పరామర్శించిన రేవంత్ ఆయనతో రాష్ట్రంలో ఇటీవల చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలను వివరించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కేసీ వేణుగోపాల్‌తో కూడా రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై చర్చించారు. హరియాణా ఎన్నికలలో తలమునకలై ఉన్నందువల్ల రాహుల్‌గాంధీని కలుసుకోలేకపోయారు. హరియాణా ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత మరోసారి రమ్మని కేసీ ఆయనకు సూచించినట్లు తెలిసింది. సీఎం తదుపరి పర్యటనలో త్వరలో చేపట్టబోయే మంత్రివర్గ విస్తరణపై వివరంగా చర్చించే అవకాశాలున్నాయి. కాగా, రాత్రి హైదరాబాద్‌కు సీఎం రేవంత్‌రెడ్డి తిరుగు పయనమయ్యారు.



# 68.72% పోలింగ్

జమ్మూ/శ్రీనగర్, అక్టోబరు1: జమ్మూ-కశ్మీర్‌లో మంగళవారం చివరిదైన మూడో దశ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మూడో దశలో 68.72%, మొత్తంగా(మూడు దశల్లో కలిపి) 64.45 శాతం ఓటింగ్ నమోదైంది. అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖల వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లోనూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని అధికార వర్గాలు పేర్కొన్నాయి. జమ్మూ, కశ్మీర్‌ల్లోని ఏడు జిల్లాల్లో ఉన్న 40 నియోజకవర్గాల్లో మూడో దళ ఓటింగ్ జరిగింది. ఆర్టికల్ 370 అధికరణం రద్దు కారణంగా తొలిసారి ఓటు హక్కు పొందిన పశ్చిమ పాకిస్థాన్ శరణార్థులు, వాల్మీకీ సమాజ్, గోరా? సామాజిక వర్గం ఓటర్లు ముందుగానే లైన్లలో నిల్చొన్నారు. ఇది 'చరిత్రాత్మక సందర్భమ'ని వారు అన్నారు. కశ్మీరీ శరణార్థుల కోసం ఢిల్లీలో నాలుగు, ఉధంపూర్ జిల్లాలో ఒకటి, జమ్మూలో 19, మొత్తం 24 ప్రత్యేక పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల కోసం 400కుపైగా కంపెనీల దళాలను నియమించారు.

# బిలియనీర్ల పెళ్లిళ్లకు వేల కోట్లు... పేదలకేమో అప్పులు!

న్యూఢిల్లీ, అక్టోబరు 1: పాతికమంది పారిశ్రామికవేత్తల కోసం మోదీ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. భారత్‌లో కేవలం ఓ 25 మంది తమ ఇంట పెళ్లిళ్లకు వేలాది కోట్లు ఖర్చు పెడుతున్నారని, అదే సమయంలో రైతులు, సామాన్య ప్రజలు మాత్రం తమ పిల్లల పెళ్లిళ్ల కోసం అప్పులు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎంపిక చేసిన కొద్దిమంది పారిశ్రామికవేత్తల కోసమే పనిచేస్తున్న మోదీ ప్రభుత్వ తీరు రాజ్యాంగ ఉల్లంఘన కాక మరేమిటని రాహుల్ ప్రశ్నించారు. దిగ్గజ పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీ తన కుమారుడి వివాహం కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారని అది ఈ దేశ ప్రజల సొత్తు అని రాహుల్ అన్నారు. హరియాణాలోని బహదూర్‌గఢ్‌లో ఎన్నికల సభలో రాహుల్ మంగళవారం ప్రసంగించారు. ఈ నెల 5న పోలింగ్ జరగనున్న హరియాణాలో హ్యాట్రిక్ కొట్టాలని బీజేపీ, పదేళ్ల తర్వాతైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ హోరాహోరీ తలపడుతున్నాయి. కాగా, హిందుత్వ సిద్ధాంతకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యాలు చేశారంటూ దాఖలైన పరువు నష్టం దావాలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి కోర్టు సమన్లు జారీ చేసింది. స్వయంగాగానీ, న్యాయవాదిని పంపించడం ద్వారాగానీ విచారణకు హాజరు కావాలని నాసిక్ అదనపు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేటు దీపాలీ పరిమల్ కదూస్కర్ సమన్లు పంపించారు.

# కాలి నడకన కొండకు పవన్

తిరుపతి, తిరుమలలో లడ్డూ కల్తీ వ్యవహారంపై ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం తిరుమల చేరుకున్నారు. బుధవారం శ్రీవారిని దర్శించుకుని దీక్ష విరమించనున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరిన పవన్ మధ్యాహ్నం 3.30 గంటలకు రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. నడకమార్గం ద్వారా తిరుమలకు వెళ్లాలనుకున్న ఆయన.. ఎయిర్‌పోర్టు నుంచి అలిపిరి పాదాల మండపం వద్దకు చేరుకున్నారు. అయితే భద్రతా సమస్య ఉన్న నేపథ్యంలో రోడ్డు మార్గం ద్వారా తిరుమలకు వెళ్లాలని పోలీసులు సూచించారు. దీంతో అలిపిరి నుంచి తిరుపతిలోని శ్రీపద్మావతి అతిథిగృహానికి చేరుకున్నారు. మెట్ల మార్గంలో వెళ్లి దీక్ష విరమించనున్నట్టు ఇదివరకే ప్రకటించడంతో.....సాయంత్రం 4.50 ప్రాంతంలో అలిపిరి చేరుకున్నారు. అలిపిరి పాదాల మండపం వద్ద సాష్టాంగ నమస్కారం చేసి పటిష్ఠ భద్రత మధ్య పవన్ కల్యాణ్ నడక మొదలుపెట్టారు. రెండు మోకీళ్లకు బెల్ట్‌లు (నీ క్యాప్) ధరించారు. అయినప్పటికీ మెట్లు ఎక్కేక్రమంలో పవన్‌లో అలసట కనిపించింది. మధ్యమధ్యలో ఎక్కువ విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. మోకాళ్ల పర్వతం వరకు వేగంగా నడిచారు. అక్కడ కాళ్ల నొప్పి తీవ్రం కావడంతో ఫిజియోథెరపీ తీసుకోవాల్సి వచ్చింది. ఒకదశలో మోకాళ్ల



పర్వతం నుంచి వాహనంలో తిరుమలకు వెళతారన్న ప్రచారం జరిగింది. దీనికి అనుగుణంగా సిబ్బందీ అప్రమత్తం అయ్యారు. అయితే, ఏడో మైలు నుంచి నెమ్మదిగా నడుచుకుంటూ రాత్రి 9.20 గంటల ప్రాంతంలో తిరుమలకు చేరుకున్నారు. వాహనాలు సిద్ధంగా ఉంచినప్పటికీ ఆర్టీసీ బస్టాండు వరకు నడిచారు. అప్పటికే అభిమానులు పెద్దఎత్తున చేరుకోవడంతో ఆర్టీసీ బస్టాండు నుంచి వాహనంలో గాయత్రి సదన్‌కు చేరుకున్నారు. రాత్రికి అక్కడే బస చేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఆయన శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రాన్ని పరిశీలిస్తారు. అక్కడ నుంచి గెస్ట్‌హౌసకు చేరుకుంటారు. గురువారం సాయంత్రం తిరుపతిలో జరగనున్న వారాహి సభలో పాల్గొని ప్రజలనుద్దేశించి మాట్లాడతారు.

# మూసీ నది ప్రక్షాళనతో పాటు మంజీరా నదిని పరిరక్షించాలి

## హెచ్ ఆర్ సి ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు మెట్టుశ్రీధర్



**పటాన్చెరు,అక్టోబర్01(డైలీ రిపోర్ట్):** మూసీనది పక్షాలనతో పాటు గోదావరి ఉపనది అయినటువంటి మంజీరా నదిని కాలుష్యం బారినుండి రక్షించాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు మెట్టుశ్రీధర్ డిమాండ్ చేయడం జరిగింది స్వచ్ఛ భారత్ పేరుతో కేంద్రప్రభుత్వం గాంధీజయంతి రోజున పరిసరాలశుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమే గానీ భావితరాలకు సాగుకు తాగుకు ఉపయోగపడే మంజీరా నది హైదరాబాద్ నుండి నాలాల ద్వారావచ్చే నీరు మరియు కంపేనీలు విడుదలచేసే రసాయనాలు నక్కవాగుద్వారా ఇస్మాయిల్ ఖాన్ పేట్ పరిసరప్రాంతంలో మంజీరా నదిలో కలవడం జరుగుతుందని మెట్టుశ్రీధర్ అన్నారు ఈ నీరు చివరకు కామారెడ్డి జిల్లాపరిధిలోని నిజాం సాగర్లో కలుస్తుందని ఈ నదిని రక్షించుకోకపోతే భవిష్యత్ ప్రశ్నార్థకమే అని మెట్టుశ్రీధర్ ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది హైదరాబాద్ లోని కుంటలు చెరువులు రక్షించాలని ప్రభుత్వం హైడ్రా సంస్థను ఏర్పాటు చేసిందని మరియు మూసీ నది సుందరీకరణ కోసం లక్షల కోట్లు వెచ్చిస్తుందని హైదరాబాదుకు కూతవేటు దూరంలో ఉండి సాగు తాగునీటిని అందించే మంజీరా నది కాలుష్యం పై ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుని కాలుష్యంభారినుండి మంజీరా నదిని రక్షించుకోవాల్సిన భాధ్యత ప్రభుత్వంతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా వాసులపై ఉందని మెట్టుశ్రీధర్ పేర్కొనడం జరిగింది ప్రభుత్వం స్పందిచకపోతే తాను గ్రీన్ ట్రీబ్యునల్ ను ఆశ్రయించనునంట్లు మెట్టుశ్రీధర్ తెలిపారు రాజ్యంగంలోని ఆర్టికల్ 21జీవితం మరియు వ్యక్తిగత స్వేచ్ఛ అనే ప్రాథమిక హక్కు ప్రకారం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కాలుష్యంలేనటువంటి పరిసరాలను అందిచాలని నీటి కాలుష్యనివారణ చట్టం 1974 ను తుంగలో తొక్కడం భాధాకరమని మెట్టుశ్రీధర్ అన్నారు మూసీ నది పరిరక్షణ తరహాలో మంజీరా నది పరిరక్షణకు ప్రత్యేక బోర్డును ఏర్పాటుచేయాలని మెట్టుశ్రీధర్ అభిప్రాయపడటం జరిగింది



## జింకలపల్లి రైస్ మిల్లులో దాడులు

### 52 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

**ఎర్రవల్లి అక్టోబర్ 01 డైలీ రిపోర్ట్:** గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం జింకలపల్లి గ్రామ శివారులో ఉన్న పద్మావతి శ్రీనివాస్ రైస్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో మంగళవారం పోలీసులు దాడులు చేసి 52 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు.ఇటిక్యాల ఎస్సై వేంకటేశ్ తెలిపిన వివరాలు ప్రకారం.. రైస్ మిల్లులో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వలు ఉన్నాయని పక్క సమాచారం తెలియడంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు.మిల్లులో తనిఖీలు చేయగా నిల్వ ఉంచిన 52 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు.సివిల్ సప్లై అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి రేషన్ బియ్యంగా గుర్తించారు.మిల్లు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## దసరా పండగకు ఊరెళ్తున్నారా.. జరభద్రం..

### సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ

**సంగారెడ్డి బ్యూరో అక్టోబర్ 1 డైలీ రిపోర్ట్:** దసరా పండుగ పురస్కరించుకొని స్కూల్స్, కళాశాలలకు సెలవులు రావడంతో చాలా వరకు తమ సొంత గ్రామాలకు కాని, ఇతరప్రాంతాలకు గాని ప్రయాణాలు చేస్తూంటారు. ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారని, ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ఐపిఎస్. సూచించారు. దసరా పండుగ వేల దొంగతనాల నియంత్రణకు జిల్లా ప్రజలకు ఎస్పీ పలు సూచనలు చేశారు.

- ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం.
- ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించమని చెప్పాలి.
- ద్విచక్రవాహనాలు, కారులను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి, రోడ్లపై నిలుపరాదు.
- ఊళ్ళకు వెళ్లే వారు ఇంటి లోపల, ఇంటి బయట ఒక లైటు వేసి ఉంచాలి.
- విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు.
- ఆరుబయట వాహనాలకు హ్యాండిల్ లాక్ తో పాటు వీల్ లాక్ వేయాలి.
- ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిది.
- సిసి కెమెరాలను ఇంటర్నెట్ కు అనుసంధానం చేసి మొబైల్ నుంచే మీ ఇంటిని ఎక్కడి నుంచి అయినా ప్రత్యక్షంగా చూసుకునే వీలుంటుంది.
- ఇండ్లలో నుండి బయటకు వచ్చే ముందు గ్యాస్ లివర్ తప్పని సరిగా ఆఫ్ చేయడం, షార్ట్ సర్క్యూట్ కాకుండా జాగ్రతలు పాటించాలి.



- ప్రజలు తమ ప్రాంతంలో గస్తీ ఏర్పాటుకు సహకరించాలి. తమ ప్రాంతం పరిధిలోని పోలీస్ స్టేషన్ అధికారి ఫోన్ నెంబర్ ఇతర అధికారుల నెంబర్ లు ప్రజలు తమ సెల్ ఫోన్ లలో ఉంచుకోవాలి.
- అనుమానాస్పదంగా తమ వీధుల్లో తిరిగే కొత్త వ్యక్తుల కదలికలపై 100 డయల్ కు గాని సంబందిత పోలీస్ అధికారులకు గాని సమాచారం ఇవ్వాలి.
- ప్రయాణాలలో రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ, జాగ్రతగా వాహనాలను నడుపుతూ క్షేమంగా గమ్య స్థానాలకు చేరుకొని, సంతోషకర వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని జిల్లా ఎస్పి సూచించారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలను అందించడం లక్ష్యంగా టీయూడబ్ల్యూజే- ఐజేయూ కృషి



సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 1 (డైలీ రిపోర్ట్): అర్హులైన జర్నలిస్టులు అందరికీ ఇంటి స్థలాలను అందించడం లక్ష్యంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) కృషి చేస్తుందని సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు బండారు యాదగిరి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. దీనికి సంబంధించి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంతో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు విరాహత్ అలీ తీవ్రంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అనేకమార్లు చర్చించారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకెళ్లడం జరిగిందని చెప్పారు. తమ సంఘం పోరాటం ఫలితంగానే గతంలో చాలా మందికి అక్రిడేషన్ కార్డులు వచ్చాయని, బస్సు పాస్ లు కూడా లభించాయని, హెల్త్ కార్డు వచ్చిందని చెప్పారు. అంతేకాకుండా చాలా ప్రాంతాల్లో ఇంటి స్థలాలు కూడా దక్కాయని వివరించారు. ఇంకా మరి కొంత మంది మిగిలిపోయారని, వారందరికీ కూడా ఇంటి స్థలాలు అందించడమే లక్ష్యంగా తమ యూనియన్ పట్టు వదలకుండా పని చేస్తుందని వెల్లడించారు. దీనిలో భాగంగానే అప్లికేషన్ ఫామ్ ను బుధవారం సంగారెడ్డిలోని ఐబీలో విడుదల చేయడం జరుగుతుందని యాదగిరి పేర్కొన్నారు. ఈ అప్లికేషన్ ఫామ్ ద్వారా అర్హులైన జర్నలిస్టులు అందరి వివరాలను సేకరిస్తున్నామని చెప్పారు. ఆ వివరాలను రాష్ట్ర యూనియన్ కు అందజేస్తామని, తద్వారా అర్హులందరికీ ఎక్కడికక్కడే ఇంటి స్థలాలను త్వరలో మంజూరు చేయించడం జరుగుతుందని వివరించారు. సంగారెడ్డి ఐబీలో బుధవారం ఉదయం 10:30 గంటలకు అప్లికేషన్ ఫామ్ విడుదల కార్యక్రమం ఉంటుందన్నారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కె.ఫైజల్, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్, ఇతర ముఖ్య నేతలు పాల్గొంటారని చెప్పారు. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో త్వరలో పెద్ద ఎత్తున వర్కింగ్ జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనం హైదరాబాదులో జరుగుతుందని తెలిపారు. ఆ సమ్మేళనంలో పాల్గొనేందుకు సంగారెడ్డి జిల్లాలోని ప్రతి మండలము, పట్టణం నుంచి పెద్ద ఎత్తున జర్నలిస్టులను తరలి రావాల్సిందిగా యాదగిరి కోరారు. ఎక్కడికక్కడే స్థానిక నాయకులు సమన్వయం చేసుకుంటూ జర్నలిస్టులను ఆత్మీయ సమ్మేళనానికి పెద్ద ఎత్తున తరలించడం జరుగుతుందన్నారు. భారీ ఎత్తున సమ్మేళనం నిర్వహించడం ద్వారా ప్రభుత్వానికి జర్నలిస్టుల సమస్యలను సమగ్రంగా వివరించే అవకాశం దక్కుతుందని చెప్పారు. ఆత్మీయ సమ్మేళనంలో ప్రతి జర్నలిస్టు పాల్గొనడం ద్వారా సంగారెడ్డి జిల్లాను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. హైదరాబాదులో జరిగే ఆత్మీయ సమ్మేళనంలో హౌసింగ్ పాలసీతో పాటు హెల్త్ కార్డుల ప్రక్రియను కూడా ప్రకటిస్తారని యాదగిరి వివరించారు.



## హోంగార్డు గోపాల్‌కు పోలీసు శాఖ అన్ని రకాలుగా అండగా ఉంటుంది

- సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారం అవాస్తవం.. వాటిని నమ్మొద్దు...
- గోపాల్ కు మెరుగైన చికిత్స అందించాలని స్వయంగా జిల్లా ఎస్పీ సూచించారు.
- ఆరోగ్య విషయమై ఎస్ఐ స్థాయి అధికారిచే పర్యావేక్షిస్తూ, ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాం.
- జీతాలకు సంభందించి ఎలాంటి పెండింగ్ బిల్స్ లేవు.
- జిల్లా ఎస్పీ సిబ్బంది సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది.
- సంగారెడ్డి జిల్లా పోలీసు సంఘం అధ్యక్షులు దుర్గారెడ్డి



**సంగారెడ్డి బ్యూరో అక్టోబర్ 1 డైలీ రిపోర్ట్:** మల్కాపూర్ పెద్ద చెర్వులోని అక్రమ నిర్మాణం కూల్చివేత సమయంలో గోపాల్ హోంగార్డు గాయపడినట్లు తెలిసి వెంటనే ఎస్పీ సంగారెడ్డి గోకుల్ హాస్పిటల్ కు చేరుకొని, అతని ఆరోగ్య పరిస్తితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స కోసం ఏఐజి హాస్పిటల్ హైదరాబాద్ కు పంపించి, జిల్లా ఎస్పీ స్వయంగా ఏఐజి హాస్పిటల్ యాజమాన్యాంతో మాట్లాడి గోపాల్ కు మెరుగైన చికిత్స అందించాలని సూచించడం జరిగింది. ఏఐజి హాస్పిటల్ నందు గోపాల్ ఆరోగ్య విషయమై ఎస్ఐ స్థాయి అధికారిచే పర్యావేక్షిస్తూ, ఎప్పటికప్పుడు అతని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడం జరుగుతుందని, పోలీసు శాఖ అతనికి అన్ని రకాలుగా అండగా ఉంటుందన్నారు. జిల్లా ఎస్పీ సిబ్బంది సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని సంగారెడ్డి జిల్లా పోలీసు సంఘం అధ్యక్షులు దుర్గారెడ్డి తెలియజేశారు. హోంగార్డు కు రావలసిన జీతాలు అన్ని సకాలంలో రావడం జరుగుతుందని, జీతాలకు సంభందించి ఎలాంటి పెండింగ్ బిల్స్ లేవని అన్నారు. ప్రస్తుతం గోపాల్ ఆరోగ్యం మెరుగ్గా ఉందని, సోషల్ మీడియా, ఇతర న్యూస్ చానల్ లలో వస్తున్న అవాస్తవాలను ఎవ్వరూ నమ్మరాదన్నారు.

## అంతర్జాతీయ సదస్సు కి, మరియు ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు కి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ ఎంపిక

**(భారత్ జాగృతి రాష్ట్ర నాయకులు,నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ NCRC తెలంగాణ రాష్ట్ర చైర్మన్ )**



**రంగారెడ్డి జిల్లా: అక్టోబర్ 01: (డైలీ రిపోర్ట్):** యూనైటెడ్ హెరిటేజ్, ఆర్ట్సఅండ్ కల్చర్ మలేషియన్ ,(UHAC) సంస్థ నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు కి, మరియు ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు కి తెలంగాణ రాష్ట్రము నుండి, డా. నలమాస శ్రీకాంత్ గౌడ్ ని ఎంపిక చేయడం జరిగింది. తెలంగాణ ఉద్యమం తో పాటు, విద్యార్థి రాజకీయాలను ప్రభావితం చేసేల పనిచెసినందుకు, భారత్ జాగృతి సంస్థ ద్వారా సాంస్కృతిక ఉద్యమం లోలి ముందుండి అనేక కార్యక్రమాలు, చేసినందుకు, అంతర్జాతీయ సదస్సు కి, ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు కి నామినేషన్ చేసినట్లు UHAC మలేషయన్ ప్రతినిధులు తెలియజేశారు. ఈ సదస్సును ఈ సంవత్సరం థాయ్ ల్యాండ్ దేశంలో ఈ నెల 5వ తేదీన నిర్వహిస్తున్నామని లిసంస్కృతులు, వారసత్వం, కళలు, అనే అంశం పైన ప్రసంగించనున్నారు. తద్వారా తెలంగాణ సంస్కృతి ని అయన తనదైన శైలిలో విస్తృత పరచడం కి కృషి చేస్తానని తెలియజేశారు. ఇంతటి గొప్ప అవకాశం నాకు రావటానికి దోహద పడిన నా గురువు, దైవం భారత్ జాగృతి వ్యవస్థపాక అధ్యక్షులు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, NCRC ఫౌండర్ చైర్మెన్ MVL నాగేశ్వర రావు లకు శ్రీకాంత్ గౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన తెలంగాణ మహిళా కాంగ్రెస్

## రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతి బీమ్ భరత్



శంకర్‌పల్లి: అక్టోబర్ 01(డైలీ రిపోర్ట్): రాష్ట్రంలో మహిళా కాంగ్రెస్ 30 వేల సభ్యత్వాలను పూర్తి చేసిందని రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతి బీమ్ భరత్ స్పష్టం చేశారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ సుమారు 30వేల పైచిలుకు సభ్యత్వాలు నమోదు చేయడం పట్ల ఆమె మండలాల మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లను అభినందించారు. జిల్లాలోని అన్ని మండలాలలో మహిళా కాంగ్రెస్ పటిష్టంగా ఉందన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మహిళా నేతలంతా సమరోత్సహంతో ముందుకు సాగారని అభినందిం చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు నుంచి మహిళా కాంగ్రెస్ చురుకైన పాత్ర పోషిస్తుందన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎన్నో పోరాటాలు నిర్వహించామని ఆమె చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. పార్టీ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ కర్గే, ప్రధాన కార్యదర్శి కేసి. వేణుగోపాల్, మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబా, రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీత రావు జిల్లాలో మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రశంసించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే అన్ని వర్గాలకు సముచిత న్యాయం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, దీనికి నిదర్శనమే సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 6 గ్యారంటీ పథకాలని తెలిపారు. సభ్యత్వ నమోదుకు సహకరించిన రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు జయమ్మ, యూత్ కాంగ్రెస్ నాయకులకు జ్యోతి బీమ్ భరత్ కృతజ్ఞతలు తెలిపారు.



## బతుకమ్మ సంబురాలు జరుపుకున్న తెలంగాణ మోడల్ స్కూల్ బృందం

**శంకర్‌పల్లి: అక్టోబర్ 01: (డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు మంగళవారం కన్నుల పండుగగా జరిగాయి. ఈ సంధర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శోభారాణి మాట్లాడుతూ తెలంగాణా ప్రజలు ప్రకృతితో మమేకం అయ్యే పండుగ 'బతుకమ్మ' అని చెప్పారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి బతుకమ్మ పండుగ ప్రతీకని కొనియాడారు. ప్రకృతిని ఆరాధిస్తూ అను బంధాలను గుర్తుచేస్తూ సాగే పూల ఉత్సవంగా సాగే తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని చాటి చెప్పే కమనీయ దృశ్యం బతుకమ్మ పండుగను తమ పాఠశాలలో అధ్యాపకులతో పాటు విద్యార్థినీలు పండగ జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు . ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూల పండుగ నిర్వహించడం మన గొప్పదనం అన్నారు. అనాదిగా వస్తున్న సంస్కృతిని పరిరక్షించుకుని భవిష్యత్ తరాలకు అందజేయాలన్నారు. విద్యార్థినులు అందంగా అలకరించిన (పేర్చిన) బతుకమ్మలు తీసుకువచ్చి పాఠశాల ఆవరణలో సంప్రదాయం ఉట్టి పడేలా పాటలతో భక్తిశ్రద్ధలతో బతుకమ్మ ఆడారు. తెలంగాణాలో బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధించే పెద్ద వండుగ అని వైస్ ప్రిన్సిపల్ అన్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అన్నారు.

## నల్లగొండపై విషం చిమ్ముతున్న బీఆర్ఎస్

### కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకుజిల్లా ప్రజలంటే ఎందుకు అంత కోపం?

### వీరిలో ఎవరైనా ఒకరు మూసీ ఒడ్డున నెలరోజులు ఉంటే తెలుస్తుంది

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్: బీఆర్ఎస్ నేతలు నల్లగొండ జిల్లాపై విషం చిమ్ముతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మాది బుల్డోజర్ పాలన కాదు.. ప్రజాపాలన. మూసీ సుందరీకరణతోపాటు శుద్ధీకరణ చేస్తున్నాం. నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్ ప్రజలు నరకయాతన పడుతుంటే.. కేసీఆర్ కుటుంబసభ్యులు రాక్షసానందం పొందుతున్నారు. నల్లగొండ జిల్లా పోరాటాల గడ్డ. రజాకార్లు, సీమాంధ్రులతో పోరాడినట్టే మూసీ వ్యతిరేకులతో పోరాడాల్సి వస్తోంది. %ఈసారి అసెంబ్లీకి కేసీఆర్ వస్తే నల్లగొండ సమస్యలపై నిలదీస్తాం. మూసీ ప్రక్షాళన పేరుతో కార్పొరేషన్ ఏర్పాటు చేసి, కాంగ్రెస్ శాసన సభ్యుడిని చైర్మన్ చేసిన కేసీఆర్ ఇప్పుడు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు. నేను రెండు దశాబ్దాలుగా ఫ్లోరైడ్, మూసీ శుద్ధీకరణ మీద పోరాటం చేస్తున్నా. ప్రధానితోపాటు కేంద్రంలో ఎందరో మంత్రులను కలిసి మూసీ శుద్ధీకరణకు నిధులు కేటాయించాలని వినతులు ఇచ్చా.

# పేద, ధనిక తేడా లేదు

### తెలంగాణలోని ప్రతి కుటుంబానికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు

### దసరాలోగా లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు

### ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి

### జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ మంత్రి పొంగులేటి

హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ పేద, ధనిక అనే తేడా లేకుండా డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు అందిస్తామని రెవెన్యూ, గృహని ర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీని వాస్‌రెడ్డి తెలిపారు. ప్రతి కుటుంబానికీ ఆరోగ్య ప్రొఫైల్ రూపొందించి యునిక్ నంబర్‌తో స్మార్ట్ కార్డ్ ఇవ్వడమే ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఉద్దేశమని చెప్పారు. 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ప్రతి నియోజకవర్గం నుంచి రెండేసి ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టనున్న కుటుంబాల వివరాల నమోదులో పొరపాట్లకు తావివ్వరాదని.. ఈ విష యంలో కలెక్టర్లు శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పలు వురు ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం సచి వాలయం నుంచి మంత్రి పొంగులేటి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫ్యా మిలీ డిజిటల్ కార్డులతోపాటు పట్టణాభివృద్ధి సంస్థలు, ఎల్ఆర్ఎస్, డబుల్ బెడ్రూం ఇళ్లు, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై సమీక్షించారు. భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిష్కారం కోసం లక్షలాది మంది ప్రజలు నాలుగేళ్ల నుంచి ఎదురుచూస్తున్నారని, అందువల్ల యుద్ధప్రాతి పది కన ఈ దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా కలెక్ట ర్లను మంత్రి పొంగులేటి ఆదేశించారు. ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ఈ ప్రక్రియ ముందుకు సాగ ట్లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణా భివృద్ధి సంస్థల పరిధి పెంపుతోపాటు కొత్త యూడీఏల ఏర్పాటు ప్రతిపాదనలను తక్షణమే పంపాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూం ఇళ్లను అరకొరగా నిర్మించారని మంత్రి పొంగులేటి విమర్శించారు. అయితే ఇప్పటికే పూర్తయిన ఇళ్ల కేటాయింపు కోసం లబ్ధిదారులను ఎంపిక చేసి దసరాలోగా అప్పగించాలని ఆదేశించారు. ఇందుకోసం జిల్లా ఇన్‌చార్జి మంత్రి చైర్మన్‌గా, జిల్లా కలెక్టర్ కన్వీనర్‌గా కొందరు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేసినందున ప్రభుత్వ పాఠశాలలు, పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రాధాన్యత ఇచ్చి మరమ్మతులు చేపట్టాలన్నారు.



## మంచినీటి సహాయకుల శిక్షణ సర్టిఫికెట్లను ప్రధానం చేసిన చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

**శంకర్‌పల్లి: అక్టోబర్ 01: (డైలీ రిపోర్ట్):** మనిషి మనుగడకు నీరే జీవనాధారం అని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. మంగళవారం శంకర్‌పల్లి మండల కేంద్రంలో మంచినీటి సహాయకుల శిక్షణ ముగింపు సందర్భంగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యాదయ్య హాజరై వారికి సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచినీటి సహాయకులకు శిక్షణ ఇవ్వడం మంచి పరిమాణం అని, శిక్షణ తీసుకున్న వారు కష్టపడి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకయ్య గౌడ్, డిఈ హారిక, ఏఈ వెంకటేశ్వరరావు, జేఈ పాల్గొన్నారు.

## రాజస్థాన్ లో తెలంగాణ సైబర్ పోలీసుల భారీ ఆపరేషన్

### 27 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్

### సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ శిఖాగోయల్ వెల్లడి



**హైదరాబాద్:అక్టోబర్ 01:** రాజస్థాన్‌లో సైబర్ సెక్యూ రిటీ బ్యూరో పోలీసులు భారీ ఆపరేషన్ నిర్వహిం చారు. జయపుర, నాగౌర్, జోధ్ పూర్, సైబర్ సెక్యూ రిటీ పోలీసుల సోదాలు నిర్వహించారు. దాదాపు 20 రోజులపాటు సెక్యూరిటీ పోలీసుల ఆపరేషన్ నిర్వహించింది. ఈ సందర్భంగా 27 మంది సైబర్ నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి భారీగా బ్యాంక్ చెక్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 31 బ్యాంక్ చెక్‌బుక్స్‌ని స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్ సైబర్ ముఠాపై దేశవ్యా ప్తంగా పలు సైబ్ నేరాలు నమోదయ్యాయి. తెలంగాణలో 189, దేశవ్యాప్తంగా 2,233 కేసులు రిజిస్టర్ అయ్యాయి29 నకిలీ ఖాతాల ద్వారా రూ.11.01కోట్లు ముఠా లూటీ చేసింది. నిందితుల నుంచి 31 సెల్‌ఫోన్లు, 37 సిమ్‌కార్డులు పోలీసుల బృందం స్వాధీనం చేసుకున్నది. 13 ఏటీఎం కార్డులు, ఏడు చెక్‌బుక్, రెండు హార్డ్ డిస్క్ లు స్వాధీనం చేసుకున్నది. తెలంగాణలో 189 కేసుల్లో రాజస్థాన్ ముఠా రూ.9 కోట్లు లూటీ చేసింది. పోలీసుల నిఘా పెరగ డంతో నగరాలు వదిలి ముఠాలు గ్రామాల వైపు దృష్టి పెట్టాయి. మారుమూల గ్రామాల్లో ఉంటూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ శిఖా గోయల్ విలేకరుల సమావేశం నిర్వహించి.. సైబర్ నేరగాళ్ల అరెస్టుకు సంబంధించి వివరాలను వెల్లడించారు. అనుమానిత లింక్స్‌ని ఎవరూ క్లిక్ చేయొద్దు సూచించారు.లింక్‌లపై అనుమానం ఉంటే పోలీసులను ఆశ్రయించాలన్నారు. దక్షిణ ఆసియా సైబర్ నేరాలకు హబ్‌లా మారాయని.. రాజస్థాన్ ముఠా రాష్ట్రంలో భారీగా నేరాలకు పాల్పడిం దన్నారు. నిరుద్యోగులు, పేదలు, ప్రభుత్వ ఉద్యోగులు లక్ష్యంగా చేసుకుంటున్నారన్నారు. సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన రూ.114కోట్లను బాధితు లకు తిరిగి ఇప్పించినట్లు తెలిపారు. సైబర్ నేరగాళ్లు మోసం చేస్తే వెంటనే కాల్ సెంటర్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు..

## 43 లక్షల మందిలో 40 మందికి అవకాశమిచ్చాం

హైదరాబాద్: 'రాష్ట్రంలో 43 లక్షల మందికి కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాలున్నాయి. అందులో కార్పొరేషన్ చైర్మన్లుగా 40 మందికి అవకాశమిచ్చాం. సామాజిక, ప్రాంతీయ సమీకరణలతో పాటు సీనియారిటీ, శ్రమ ఆధారంగా అనేక వడపోతల తర్వాత మీకు చైర్మన్ పదవులొచ్చాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీరంతా బాగా పనిచేశారు. మీలో ఎంపీలు, ఎమ్మెల్యేలు కావాల్సిన వారు కూడా ఉన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చాక కాస్త విశ్రాంతి తీసుకుంటున్నట్టు కనిపిస్తోంది. మీరు ఎలా పనిచేస్తున్నారో ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోండి. పార్టీ కోసం మీరేం చేస్తున్నారన్న సమాచారం ఎప్పటికప్పుడు మాకు వస్తోంది. పనిచేయకపోతే భవిష్యత్‌లో మీరే నష్టపోతారు.'అని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. 10 మంది చైర్మన్లు మాత్రమే చురుగ్గా పార్టీ కోసం పనిచేస్తున్నారని, సీఎం, మంత్రులు రోజుకు 18 గంటల పాటు విశ్రాంతి లేకుండా పనిచేస్తుంటే మీరెంతసేపు పనిచేస్తున్నారంటూ మంగళవారం గాంధీభవన్‌లో రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల చైర్మన్లతో జరిగిన సమావేశంలో ఆయన క్లాస్ తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పనిచేస్తుంటే ప్రతిపక్షాలు పనికట్టుకొని బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని, ఆ దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707